క్లుప్తంగా

స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు భేష్



అంతర్వేదిలో స్కౌట్ పతాకాన్ని ఆవిష్కరించిన ఎంపీపీ మల్లిబాబు

సఖినేటిపల్లి: ప్రపంచ స్కౌట్స్ అండ్ గైడ్స్ దినోత్సవం గురువారం అంతర్వేది లక్ష్మీనృసింహుని దేవస్థానంలో ఘనంగా నిర్వహించారు. పితామహుడు బాడెన్ పావెల్ జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన స్కౌట్ పతాకాన్ని ఎంపీపీ వీరా మల్లిబాబు ఆవిష్కరించారు. సమాజానికి స్కౌట్స్ అండ్ గైడ్స్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. స్కౌట్ మాస్టర్స్ కె.కృష్ణప్రసాద్, వి.సుబ్రహ్మణ్యం, ఎస్కే బాజీ, కె.భాస్కర్, పి.జయరామ్, కె.సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

180 మందికి వైద్య సేవలు

మామిడికుదురు: పెదపట్నంలంక ప్రధాన ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం జరిగింది. నగరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.స్వర్ణలత సుమారు 180 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందించారు. వేసవి కాలం సమీపిస్తున్న తరుణంలో ఆరోగ్యపరంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్న రోగుల ఇంటికి వెళ్లి, పరీక్షలు చేసి తగు సూచనలు అందించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ఎస్.సూరిబాబు, ఏఎన్ఎం పి.నాగమణి, ఎంఎల్‌హెచ్‌పీ పి.నాగదుర్గ, డీఈఓ సీహెచ్ఎస్ఎస్ సత్యనారాయణ, ఆశా కార్యకర్తలు గీత, విజయదుర్గ పాల్గొన్నారు.

26న రైతులకు అవగాహన

అంబాజీపేట: ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద ఈ నెల 26న విద్యుత్ మోటార్లు, మీటర్లపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు ఆ శాఖ అధికారులు తెలిపారు. ఉదయం పది గంటలకు ప్రారంభమయ్యే ఈ సదస్సుకు విద్యుత్ మీటర్లు తీసుకున్న రైతులు విధిగా హాజరుకావాలని కోరారు.

బాధితునికి రెడ్ క్రాస్ సాయం



పుల్లేటికుర్రులో బాధితుడికి సాయం అందిస్తున్న తహసీల్దార్

అంబాజీపేట: పుల్లేటికుర్రు శివారు గొల్లగుంటలోని గుబ్బలవారిపాలెంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి రెడ్ క్రాస్ సభ్యులు గురువారం సాయం అందజేశారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు రెడ్ క్రాస్ చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ ఆధ్వర్యంలో బాధితుడు గుబ్బల వెంకటరమణకు వంటసామగ్రి, టార్పాలిన్, బియ్యం, దుస్తులను తహసీల్దార్ జె.విమలకుమారి, సర్పంచ్ జల్లి బాలరాజు అందజేశారు. అలాగే వ్యాఘ్రేశ్వర ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో రూ.6,300, టీడీపీ నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. ఎంపీటీసీ కుసుమ వెంకటేశ్, ఆర్ఐ ఇబ్రహీం పాల్గొన్నారు.

కాపునాడు మండల అధ్యక్షుడిగా తాతాజీ



మామిడికుదురు: పెదపట్నంలంక గ్రామానికి చెందిన గుండాబత్తుల శ్రీనుగోవిందరావు (తాతాజీ) మామిడికుదురు మండల కాపునాడు అధ్యక్షుడిగా నియమితులయ్యారు. రాష్ట్ర కాపునాడు వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బిరెడ్డి సురేష్ జారీ చేసిన ఉత్తర్వులు గురువారం తాతాజీకి అందాయి. కాపుల అభ్యున్నతికి కృషి చేస్తానని ఈ సందర్భంగా తాతాజీ పేర్కొన్నారు. పి.గన్నవరం ఇన్‌చార్జి తోట శ్రీనివాసరావు, కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు పురంశెట్టి మంగారావు, ఉపాధ్యక్షుడు గంగుమళ్ల శ్రీనివాస్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మాతృ భాష అమ్మ వంటిది

రావులపాలెం: అందరికీ మాతృ భాష అమ్మ వంటిదని, మాతృభాషను గుర్తుంచుకుని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలని రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల తెలుగు విభాగం ప్రధాన అధ్యాపకురాలు కె.ప్రిస్కిల్లా అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు ప్రధాన అధ్యాపకుడు జి.హరిబాబు ఆధ్వర్యంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యమూర్తి అధ్యక్షతన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణ్‌కుమార్, సుభాషిణి పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఆలమూరు: మూలస్థానం అగ్రహారంలో ఉన్న షిర్డీసాయి ఆలయ 17వ వార్షికోత్సవ వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. ఆలయానికి చేసిన విద్యుద్దీపాలంకరణ చూపరులకు కనువిందు చేసింది. షిర్డీసాయికి ఉదయం పంచామృతాలు, పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు. సాయినాథునికి నిర్వహించిన గ్రామోత్సవంలో వందలాది మంది యువతులు గోదావరి జలాలను బిందెలతో పట్టి, ఊరేగింపుగా తరలివెళ్లారు. ఆలయానికి చేరుకుని సాయినాథుడికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయం వద్ద నిర్వహించిన పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భారీ అన్నదానం చేశారు.

మహమ్మారిని తరిమేద్దాం

- కుష్ఠు వ్యాధి నిర్మూలన లక్ష్యంగా కార్యాచరణ
- ప్రజల్లో అవగాహనకు విస్తృత ప్రచారం
- అందుబాటులో అధునాతన ఔషధాలు



నగరంలో కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య కార్యకర్తలు

మామిడికుదురు: కుష్ఠువ్యాధిని సమూలంగా నిర్మూలించాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్యాచరణ చేపట్టాయి. గత ఏడాది జూలైలో వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు ప్రత్యేక సర్వే నిర్వహించాయి. ఈ ఏడాది జనవరి 30 నుంచి ఈ నెల 21వ తేదీ వరకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కుష్ఠువ్యాధి అంటువ్యాధి కాదంటూ ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నారు. దీనిపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, ప్రజల్ని చైతన్యవంతులను చేసే దిశగా ఆరోగ్య కార్యకర్తలు ముందుకు వెళ్తున్నారు. 2027 నాటికి కుష్ఠు వ్యాధిని సమూలంగా నిర్మూలించాలన్న లక్ష్యంతో కార్యోన్ముఖులయ్యారు.

కుష్ఠు వ్యాధి లక్షణాలివీ..

చర్మంపై స్పర్శ లేని మచ్చలు, మందంగా మెరిసే జిడ్డుగల చర్మం, బత్తాయి తొక్క తరహాలో ఉండడం, చెవులపై, వీపుపై, ఎదపై నొప్పి లేని బొడిపెలు, కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, కనురెప్పలు మూత పడకపోవడం, ముక్కుదిబ్బడ, ముక్కులోంచి రక్తం కారడం, కాళ్లు, చేతులు తిమ్మిర్లు లేక జోములు కలిగి ఉండడం, అరచేతులు, అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం, చల్లని లేదా వేడి వస్తువులను గుర్తించలేకపోవడం, చేతుల నుంచి వస్తువులు జారిపోవడం, కాళ్ల చెప్పులు జారిపోవడం, తెలియకుండానే కాళ్లు, చేతుల్లో బొబ్బలు రావడం, చేతి వేళ్లు, కాలివేళ్లు వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం.

20 పీహెచ్‌సీల్లో పరిస్థితి ఇదీ..

పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల్లో 20 పీహెచ్‌సీలున్నాయి. వాటి పరిధిలో మొత్తం 169 కుష్ఠు వ్యాధి కేసులు నమోదయ్యాయి. పాత కేసులు 163 ఉండగా, కొత్తగా మరో ఆరు కేసులు వెలుగుచూశాయి. పి.గన్నవరం నియోజకవర్గంలో 8 పీహెచ్‌సీల పరిధిలో పాత కేసులు 58 ఉండగా, కొత్తగా ఐదు కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించారు. రాజోలు నియోజకవర్గ పరిధిలో ఐదు పీహెచ్‌సీల్లో పాత కేసులు 72 ఉన్నాయి. కొత్త కేసులు నమోదు కాలేదు. కొత్తపేట నియోజకవర్గంలో ఏడు పీహెచ్‌సీలో పాత కేసులు 33 కాగా, కొత్తగా రెండు కేసులను గుర్తించారు. కుష్ఠు వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్యులు మల్టీ డ్రగ్ థెరపీ మెడిసిన్ ద్వారా చికిత్స అందిస్తున్నారు.

కుష్ఠు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



కుష్ఠు వ్యాధిపై ప్రజల్లో చాలా అపోహలున్నాయి. ముందుగా వీటి నుంచి ప్రజలు బయటకు రావాలి. ఇది అంటువ్యాధి కాదు. ఇది ఒకరి నుంచి మరొకరికి సోకే అవకాశం లేదు. దీనిపై ఉన్న అనుమానాలను నివృత్తి చేసేందుకు ఆరోగ్య కార్యకర్తలు తీవ్రంగా శ్రమిస్తున్నారు. దీనిపై ప్రతిఒక్కరిలో చైతన్యం రావాలి. ఈ వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం పక్కాగా చర్యలు తీసుకుంటోంది. ఈ బృహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి.

– భూసారపు వీవీ సత్యనారాయణ, లెప్రసీ నోడల్ అధికారి

ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నాం



కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఇటీవల ఇంటింటా సర్వే నిర్వహించాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆరోగ్య కార్యకర్తలు పక్కాగా ఈ సర్వే చేపట్టారు. అనుమానితులను ప్రతిఒక్కరినీ ప్రత్యేకంగా పరిశీలించారు. కుష్ఠు వ్యాధి లక్షణాలున్న వారిని పీహెచ్‌సీకి తీసుకు వచ్చి పరీక్షలు చేశాం. పరీక్షల నిర్వహణ అనంతరం వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఎండీటీ మందులను ఉచితంగా అందజేస్తున్నాం. – కేజే ప్రశాంత్, వైద్యాధికారి, నగరం పీహెచ్‌సీ

కేసులు గణనీయంగా తగ్గాయి



గతంతో పోల్చుకుంటే కుష్ఠు వ్యాధి కేసులు జిల్లాలో గణనీయంగా తగ్గాయి. ఈ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయిస్తున్నాం. దీనిపై ప్రతిఒక్కరూ అవగాహన చేసుకుని, కుష్ఠు వ్యాధిరహిత రాష్ట్రంగా మార్చేందుకు సహకారం అందించాలి. ప్రజల భాగస్వామ్యంతోనే ఇది సాధ్యమవుతుంది.

– కేవీవీ వరలక్ష్మి, లెప్రసీ జిల్లా నోడల్ అధికారిణి, ముమ్మిడివరం

ఘనంగా పొళ్లమ్మ ఆలయ పునః ప్రతిష్ఠ



ఈదరాడలో పునః ప్రతిష్ఠించిన పొళ్లమ్మ అమ్మవారు

మామిడికుదురు: ఈదరాడ గ్రామ దేవత పొళ్లమ్మ అమ్మవారి ఆలయ పునః ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. వేద మంత్రాలు, భక్తుల కోలాహలం, బాణసంచా కాల్పుల నడుమ విగ్రహ, శిలా విగ్రహ మహా సంప్రోక్షణ, నూతన ఆలయ శిఖర, ముఖ మంటపం ప్రతిష్ఠా మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సుదర్శనం వెంకటజనార్ధనాచార్యులు ఆధ్వర్యంలో యెరుబండి శ్రీవెంకటసత్యనాగేంద్ర వరప్రసాద్, చిక్కం సురేంద్ర, జక్కంపూడి నాగభూషణం, వడ్డే ఆదినారాయణ మూర్తి, యెరుబండి శివప్రభాకర్, యెరుబండి శ్రీనివాసరావు, దొడ్డా శ్రీరామ్, నేదూరి లక్ష్మణరావు, కడలి వెంకటరమణ, యెరుబండి శ్రీనివాసరావు, యెరుబండి నాగభూషణం, యెరుబండి నాగేశ్వరరావు, కొట్టుబాబు దంపతులు కర్తలుగా పాల్గొని, పూజలు నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణ కమిటీ రథ సారథి యెరుబండి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో ప్రతిష్ఠా మహోత్సవం జరిగింది. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, ఎంపీపీ కుసుమ వనజకుమారితో పాటు, పలు పార్టీలకు చెందిన ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ముస్లిం మైనార్టీలకు అండగా జగన్

ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి



కొత్తపేటలో షేక్ ఖాజాబాబును సత్కరిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

కొత్తపేట: రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల సంక్షేమానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం బడ్జెట్‌లో అత్యధిక ప్రాధాన్యమిచ్చి, ప్రత్యేక నిధులు కేటాయించిందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. స్థానిక కమ్మిరెడ్డిపాలెం జామియా మసీదు, షాదీఖానా ప్రాంగణంలో ప్రహరీ, అభివృద్ధి పనులకు ఎంపీ నిధులు రూ.5 లక్షలు మంజూరు కాగా, గురువారం సాయంత్రం మసీదు, షాదీఖానా ప్రెసిడెంట్, జిల్లా ముస్లిం మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడు షేక్ ఖాజాబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆయా పనులను ప్రారంభించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేరున, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పేరున మసీదులో ఇమామ్ ఇంతియాజ్ అహ్మద్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మళ్లీ వారు అధికారంలోకి వచ్చేందుకు అల్లా ఆశీర్వదించాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా మండల ముస్లిం, మైనార్టీ నాయకుడు షేక్ గౌస్ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో, నేడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే ముస్లింలకు ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. నాడు వైఎస్సార్ ముస్లింలకు సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు 4 శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. మళ్లీ జగన్ ప్రభుత్వంలోనే ముస్లింల సంక్షేమానికి ప్రాధాన్యం లభించిందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం కేవలం రూ.1100 కోట్లు మాత్రమే కేటాయించి చిన్నచూపు చూడగా, నేడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఏకంగా రూ.2,242.36 కోట్లు కేటాయించిందన్నారు. ఇది మైనార్టీల సంక్షేమంపై సీఎం జగన్‌కు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. రాబోయే ఎన్నికల్లో ముస్లిం, మైనార్టీలందరూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అండగా నిలిచి, ఆశీర్వదించాలని కోరారు.

ఖాజాబాబుకు ఘన సన్మానం

వైఎస్సార్ సీపీ జిల్లా ముస్లిం మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన షేక్ ఖాజాబాబును ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. జిల్లాలో ముస్లింలు అందరినీ వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఏకతాటిపైకి తేవాలని ఆయన ఖాజాబాబుకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మార్గన గంగాధరరావు, ఎంపీటీసీ చావలి సుబ్బరాయశాస్త్రి, జిల్లా వక్ఫ్ బోర్డు సభ్యులు మహ్మద్ హారూన్, ఎండీవై షరీఫ్, మహ్మద్ ఆలీషా, పార్టీ గ్రామ అధ్యక్షుడు సలాది బ్రహ్మాజీ, ముస్లిం నాయకులు షేక్ దావూద్‌జానీ, ముగ్బూల్, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకే మద్దతు ఇవ్వండి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే చిట్టిబాబు



నందంపూడిలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న చిట్టిబాబు, వేణుగోపాలరావు

అంబాజీపేట: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగించిన సంక్షేమ, అభివృద్ధి పాలనకు ప్రజలంతా మళ్లీ మద్దతు పలకాలని జెడ్పీ చైర్మన్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. నందంపూడి, వాకలగరువు, చిరతపూడిల్లో సర్పంచ్‌లు పితాని మంగాదేవి, మద్దింశెట్టి దొరబాబు, కోట బేబిరాణి అధ్యక్షతన నూతనంగా నిర్మించిన ఆర్బీకే, సచివాలయాలను గురువారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు, ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సచివాలయాలు, ఆర్బీకేలు ఏర్పాటు చేయడం వల్ల గ్రామాల్లోని ప్రజలకు, రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. వైఎస్సార్ సీపీతోనే అని వర్గాలకూ సంక్షేమ పథకాలు అందాయన్న విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తించాలన్నారు. అనంతరం నందంపూడిలో ఎమ్మెల్యే చిట్టిబాబును, ఇన్‌చార్జి వేణుగోపాలరావును పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఉభయ గోదావరి జిల్లాల గ్రీవెన్స్ కన్వీనర్ పేరి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షులు దొమ్మేటి సత్యమోహన్, బొంతు శ్రీను, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, వైస్ ఎంపీపీ నేతల నాగారాజు, పార్టీ మండల అధ్యక్షుడు విత్తనాల శేఖర్, మట్టపర్తి హరి, పితాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల ద్వారా ప్రజలకు సేవలు

జెడ్పీ చైర్మన్ విప్పర్తి, ఎమ్మెల్యే చిట్టిబాబు



పి.గన్నవరంలో వలంటీర్లకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న విప్పర్తి, చిట్టిబాబు

పి.గన్నవరం: దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఎన్నో సేవలు అందిస్తున్నారని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా మండలంలో ఐదుగురు వలంటీర్లకు సేవా రత్న, 435 మందికి సేవా మిత్ర అవార్డులను గురువారం వారు అందజేసి, ఘనంగా సత్కరించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథులు వేణుగోపాలరావు, చిట్టిబాబు మాట్లాడుతూ వలంటీర్లు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. ఎలాంటి వివక్ష లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ సీహెచ్ త్రిశూలపాణి, మంతెన రవిరాజు, సర్పంచ్‌లు తోలేటి బంగారునాయుడు, వడలి కొండయ్య, దొమ్మేటి పార్వతి, యల్లమెల్లి కృష్ణవేణి, బండి మహాలక్ష్మి, శృంగవరపు లక్ష్మణరావు, సొసైటీ చైర్మన్ మెల్లం మహాలక్ష్మీప్రసాద్, పార్టీ రాష్ట్ర నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, పితాని నర్సింహరావు, దొమ్మేటి వెంకట శివరామన్, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధి పనులు ప్రారంభం



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాపాక

రాజోలు: రాజోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.47.86 లక్షలతో పూర్తి చేసిన అభివృద్ధి పనులను రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు–నేడు పథకంలో కళాశాలలు, పాఠశాలలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశారన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజా రమణి, మాజీ ఏఎంసీ చైర్మన్ గెద్దాడ సత్యనారాయణ, శివకోటి సర్పంచ్ నక్కా రామారావు, నాయకులు రాపాక వెంకట్‌రామ్, కంచి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అంబాజీపేట: అంబాజీపేట, గంగలకుర్రు, ముక్కామల విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో ఉన్న గ్రామాలకు శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అమలాపురం ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. విద్యుత్ తీగలు, సబ్ స్టేషన్ నిర్వహణ కోసం సరఫరాను నిలుపుదల చేస్తున్నామని చెప్పారు.

మామిడికుదురు: హైవేలో చెట్ల తొలగింపు, నగరంలోని 33 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల కోసం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని ఈఈ ఎం.రవికుమార్ గురువారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ నగరం సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని చెప్పారు.

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



రావులపాలేనికి చెందిన వలంటీరు మాధవికి సేవా వజ్ర అవార్డును అందిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, ఇతర నాయకులు

రావులపాలెం: రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థ సేవారంగంలో అందరి ప్రశంసలు పొందుతోందని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక ఎంకేఆర్ కన్వెన్షన్ హాల్లో గ్రామ వార్డు వలంటీర్లకు అవార్డులు ప్రదానం చేసే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రావులపాలెం, కొత్తపేట, ఆలమూరు, ఆత్రేయపురం మండలాలకు చెందిన వలంటీర్లకు అవార్డులు అందజేశారు. ముఖ్యఅతిథి ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛందంగా గ్రామాల్లో సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎలాంటి వివక్ష లేకుండా, అర్హత ఒక్కటే ప్రామాణికంగా ఎంపికలు చేయడంతో పాటు అమలు చేస్తున్నారని చెప్పారు. ఈ సేవలు అందించడంలో వలంటీర్లు ప్రధాన భూమిక పోషిస్తున్నారన్నారు. వారికి సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులు ఇవ్వడం వారి సేవలను గుర్తించడం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు కర్రి లక్ష్మీ వెంకట నాగదేవి, మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీలు కుడిపూడి శ్రీనివాసరావు, గూడపాటి రమాదేవి, డీసీఎంఎస్ చైర్మన్ సాకా మణికుమారి, సర్పంచులు తాడేపల్లి నాగమణి, రెడ్డి చంటి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నూతన వసంత మంటపం ప్రారంభం



మంటపం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు, ప్రజాప్రతినిధులు

సఖినేటిపల్లి: అంతర్వేది క్షేత్రంలో గురువారం నూతనంగా రూ.18 లక్షలతో నిర్మించిన వసంత మంటపాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామ గోపాల రాజ బహద్దూర్ కలిసి ప్రారంభించారు. ఏటా ఉత్సవాల్లో పౌర్ణమి రోజున స్వామి సముద్రంలో స్నానమాచరించిన అనంతరం వసంత మంటపంలో సేద తీరడం ఆనవాయితీగా వస్తోంది. వసంత మంటపం పూర్తి శిథిల స్థితికి చేరడంతో, నూతన వసంత మంటపం నిర్మాణానికి దేవస్థానం శ్రీకారం చుట్టింది. ఈ మేరకు పూర్తి రాయితో మంటప నిర్మాణం పూర్తి చేశారు. ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు, ఎస్సై ఎస్.రాము, జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్‌లు కొండా జాన్ బాబు, ఒడుగు శ్రీను, ఎంపీటీసీ బైరా నాగరాజు పాల్గొన్నారు.

పంటలకు సాగునీరు అందించాలి



నగరంలో నిరసన తెలుపుతున్న రైతులు

మామిడికుదురు: నగరం గ్రామంలోని గుర్రాల చెరువు ప్రాంతంలో పంటలకు సాగునీరు అందడం లేదంటూ రైతులు గురువారం ఆందోళన చేశారు. వరి పంట నెర్రలు తీసి, ఎండిపోతోందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వంతుల వారీగా సాగునీరు అందిస్తామని చెప్పినా, అది సక్రమంగా అమలు కావడం లేదన్నారు. గుర్రాల చెరువు ప్రాంతంలో సుమారు 200 ఎకరాల ఆయకట్టు నెర్రలు తీసిందని వాపోయారు. పంట ప్రస్తుతం మండి పొట్ట దశలో ఉన్న సమయంలో సాగునీటి సమస్య ఏర్పడడంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. ఇంతవరకూ ఎకరానికి రూ.30 వేల వరకూ పెట్టుబడి పెట్టామని, నాట్లు వేసి నెల రోజులు దాటిందన్నారు. ఇరిగేషన్ అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లినా, వారు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఈ ఆందోళనలో రైతులు తాటికాయల ఉదయభాస్కరరావు, కడలి సత్యనారాయణ, బొంతు భాస్కరరావు, విత్తనాల సుబ్బలక్ష్మి, విత్తనాల సూర్యకాంతం, కూన నర్సింహారావు, మీర్ జుల్ఫికర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ

మామిడికుదురు: క్వాయర్ బోర్డు ఆధ్వర్యంలో రెండు నెలల పాటు 20 మంది మహిళలకు క్వాయర్ యార్న్ స్పిన్నింగ్ ప్రోగ్రాంలో భాగంగా ఉచిత శిక్షణ ముగిసింది. శిక్షణ పొందిన మహిళలకు గురువారం సర్టిఫికెట్లు అందించారు. కోనసీమ కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో పెదపట్నంలంకలో శిక్షణ ఇచ్చారు. కంపెనీ చైర్మన్ వేగి వెంకటేశ్వరరావు, ట్రైనింగ్ అసిస్టెంట్ ఎం.అర్జున్, ఫ్యాకల్టీ రమేష్ రామస్వామి పాల్గొన్నారు.

ఘనంగా కవలల దినోత్సవం

పి.గన్నవరం: పోతవరం ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం కత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో గురువారం కవలల దినోత్సవం నిర్వహించారు. పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న కవలలు కోట రోహిత, రోహిణిలతో కేక్‌ను కట్ చేయించారు.

ఆలమూరు: స్థానిక బొబ్బా జయశ్రీ బాలికోన్నత పాఠశాలలో చదువుతున్న కవల సోదరీమణులను గుర్తించి, సత్కరించారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో కవలల దినోత్సవం జరిగింది.

మార్చి 9న లోక్ అదాలత్


కొత్తపేట: జాతీయ లోక్ అదాలత్‌ను వివిధ కేసుల కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి ఎం భాస్కరరావు అన్నారు. వచ్చే నెల 9న జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకుని గురువారం స్థానిక కోర్టులో పోలీస్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ముఖ్యంగా వివిధ కేసుల కక్షిదారులకు లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించడం ద్వారా కేసులు పరిష్కరించుకునేలా కృషి చేయాలని సూచించారు.

25న విగ్రహ ప్రతిష్ఠ

పి.గన్నవరం: ముంగండ గ్రామంలో రూ.కోటి వ్యయంతో పునర్నిర్మించిన ముత్యాలమ్మ ఆలయ, విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 25వ తేదీ ఉదయం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని చెప్పారు.

అదే జోరు, అదే సందడి

- తగ్గని భక్తుల రద్దీ
- బీచ్‌లో రక్షణ ఏర్పాట్లు



భక్తుల రక్షణకు ఏర్పాటు చేసిన బారికేడ్లు

సఖినేటిపల్లి: అంతర్వేది శ్రీలక్ష్మీనృసింహుని కల్యాణ మహోత్సవాల్లో గురువారం కూడా భక్తుల రద్దీ కొనసాగింది. మాఘమాసంలో సముద్ర స్నానాలకు ప్రాధాన్యం ఉండడంతో అంతర్వేది బీచ్ సందడిగా మారింది. పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తితో పాటు ఆహ్లాదాన్ని అందించే జెయింట్ వీల్స్, రంగుల రాట్నం, ఉయ్యాల పడవ వద్ద పిల్లాపాపలతో తల్లిదండ్రులు సంతోషంగా గడిపారు. ఈ నెల 24వ తేదీ పౌర్ణమిని పురస్కరించుకుని స్వామివారితో పాటు సముద్ర స్నానం చేయడానికి తరలివచ్చే అసంఖ్యాక భక్తుల రక్షణకు అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. బీచ్‌లో మహిళలకు దుస్తులు మార్చుకునే తాత్కాలిక గదులను సిద్ధం చేస్తున్నారు. బీచ్ వద్ద సముద్రంలో లోతు ప్రదేశాల్లో వెళ్లకుండా భక్తుల రక్షణకు సర్వేబాదులతో బారికేడ్లు ఇప్పటికే ఏర్పాటు చేశారు. వీటితో పాటు, పోలీసుల పహారాకు వాచ్ టవర్లు, ముందస్తు హెచ్చరికలు జారీ చేసే మైక్‌సెట్లను బీచ్ ఒడ్డున ఏర్పాటు చేస్తున్నారు.